

సోమశిలలో 35.67 టీఎంసీలు

సోమశిల: సోమశిలలో ఆదివారం సాయంత్రానికి 35.67 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 3818 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,750
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,725
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,897
నవర (8 గ్రాములు)	రూ.47,176

గరిష్టం/కనిష్టం
31.2 /24.4

వాతావరణం

గాలిలో తేమ 76 శాతంగా ఆదివారం నమోదైంది. జిల్లాలో అక్కడక్కడా ఆకాశం సోమవారం మేఘావృతమై ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నెట్‌బాల్ జాతీయ పోటీల్లో సత్తా చాటాలి



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఆత్మకూరు: హరియాణాలో నిర్వహించనున్న జాతీయ పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టు సత్తా చాటాలని నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అబ్జర్వర్ ప్రకాష్ పేర్కొన్నారు. 41వ సీనియర్ నేషనల్ నెట్‌బాల్ పురుషుల చాంపియన్‌షిప్ కోసం క్రీడాకారుల ఎంపికలను పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించారు. నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి 23 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకొచ్చేందుకు ఎన్‌ఎఫ్‌ఐ విశేష కృషి చేస్తోందని చెప్పారు. ఎంపికైన వారు హరియాణాలో నిర్వహించనున్న సీనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారని వివరించారు. జిల్లా ఆర్గనైజింగ్ పీడీ తిరుపతయ్య పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన అదానీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు

ముత్తుకూరు: జాతీయ తైక్వాండో పోటీల్లో అదానీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి పలు పతకాలను దక్కించుకున్నారు. బెంగళూరులో ఆదివారం నిర్వహించిన టోర్నీకి 8 రాష్ట్రాల్లోని 300 పాఠశాలల నుంచి 1800 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. 44 కిలోల విభాగంలో లాస్య ప్రియ.. 61 కిలోల విభాగంలో అనునివేష్ స్వర్ణ పతకాలను సాధించారని చెప్పారు. సోమిని, గురుత్తమ్ రజత.. ప్రణయ్ కాంస్య పతకాలను సాధించారని పేర్కొన్నారు. విజేతలను పోర్టు సీఈఓ జీజే రావు, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్ తదితరులు అభినందించారు.

దేశీయ తెల్ల రొయ్యతో అధిక లాభాలు



పరిశీలిస్తున్న కేంద్ర బృందం

విడవలూరు: సీబా ఆధ్వర్యంలో ప్రవేశపెడుతున్న దేశీయ తెల్ల రొయ్యలతో ఆక్వా రైతులకు అధిక లాభాలు సమకూరుతాయని కేంద్ర మత్స్యశాఖ డీడీజీ జానా పేర్కొన్నారు. తెల్ల రొయ్య సాగుపై ఊటుకూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రైతులకు అవగాహన సదస్సును మత్స్య సంపద జాగృక్త అభియాన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సముద్రం ద్వారా బ్రూడర్‌ను తీసుకొచ్చి హేచరీల ద్వారా నాణ్యమైన సీడ్‌ను సృష్టించి రైతులకు తక్కువ ధరకే అందజేయనున్నామని వెల్లడించారు. ఈ సాగు ద్వారా 90 రోజుల వ్యవధిలోనే 50 కౌంట్‌కు రావడం శుభపరిణామమని చెప్పారు. తెల్ల రొయ్య సాగు ద్వారా ఊటుకూరుకు చెందిన పాన్నాల కృష్ణారెడ్డి అధిక లాభాలను గడిస్తున్నారని చెప్పారు. సదరు రైతుకు సంబంధించిన సాగు పొలాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, స్థానికులు రామిరెడ్డి విజయభానురెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తేలు కాటుతో బాలుడి మృతి

లింగసముద్రం: తేలు కాటుతో బాలుడు మృతి చెందిన ఘటన లింగసముద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. లింగసముద్రం గ్రామానికి చెందిన గోగుల మహేంద్ర (9) స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలకు సెలవు కావడంతో తన తండ్రి మల్లికార్జునతో కలిసి గేదెలు మేపేందుకు ఊరి చివరనున్న పొలాల్లోకి వెళ్లాడు. అక్కడికి సమీపంలోని ఇంటి ప్రహరీపై ఉన్న కండువాను మహేంద్ర తలమీద వేసుకున్నాడు. కండువాలో ఉన్న తేలు తలకు కుట్టడంతో కేకలు వేశాడు. తండ్రి వచ్చి కండువాను పరిశీలించగా తేలు కనిపించింది. వెంటనే 108 వాహనంలో కందుకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మహేంద్ర మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రైతన్నకు నాణ్యమైన విద్యుత్



రైతు సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. రైతు భరోసా.. పగటి వేళ తొమ్మిది గంటల పాటు నాణ్యమైన వ్యవసాయ విద్యుత్ సరఫరా.. ఉచిత విద్యుత్.. వడ్డీ లేని రుణాలు.. ఇలా వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం తాజాగా మరో అడుగు ముందుకేసింది. వ్యవసాయ మోటార్లకు అందజేసే విద్యుత్ మరింత నాణ్యతగా ఉండేలా అధిక సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లను నామమాత్రపు రుసుముతో ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో 16 కేవీఏ స్థానంలో 25 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు.

- 16 కేవీఏ స్థానంలో 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు
- నామమాత్రపు రుసుముకే ఏర్పాటు
- ప్రభుత్వ నిర్ణయంపై అన్నదాతల హర్షాతిరేకాలు

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): వ్యవసాయ మోటార్లకు అందజేసే విద్యుత్ మరింత నాణ్యతగా ఉండాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ తరుణంలో అదనపు సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవానికి 25 కేవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలంటే రూ.రెండు లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే ప్రభుత్వ నిర్ణయంతో రూ.12,600 నామమాత్రపు రుసుమును చెల్లించి ఈ సౌకర్యాన్ని పొందవచ్చు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రస్తుతం 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 27,410 ఉండగా, ఈ స్థానంలో 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు కానున్నాయి.

25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లతో ఉపయోగాలు

- 16 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్‌లోడ్ కారణంగా కాలిపోయే ప్రమాదం ఉంది.
- 25 కేవీఏతో విద్యుత్ ఓవర్‌లోడ్ వచ్చినా కాలిపోయేందుకు ఆస్కారం ఉండదు.
- 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాక దాని సామర్థ్యం క్రమేపీ తగ్గుతూ వస్తుంది. ఫలితంగా దీని జీవితకాలం తగ్గేందుకు అవకాశం ఉంటుంది. అదే 25 కేవీఏతో ఓవర్‌లోడ్ వచ్చే పరిస్థితే ఉండదు.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో..

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు :	16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు
2,16,732	27,410

25 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఖర్చు - రూ.రెండు లక్షలు
రైతులు చెల్లించాల్సింది - రూ.12,600



విద్యుత్ భవన్

- 25 కేవీఏతో పగటిపూట నిరంతరాయంగా తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్‌ను వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

అవగాహన లేమి

జిల్లాలోని చాలా మంది రైతులకు ఈ విషయమై అవగాహన లేదు. ఈ అంశమై గ్రామాల్లోని రైతులకు విద్యుత్ శాఖ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది. 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో చేకూరే ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఇదీ పరిస్థితి

డివిజన్	వినియోగంలో ఉన్న 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు
నెల్లూరు టౌన్	5
నెల్లూరు రూరల్	4,910
కావలి	7,307
గూడూరు	5,647
నాయుడుపేట	5,337
ఆత్మకూరు	4,204
మొత్తం	27,410

రైతు శ్రేయస్సుకు ప్రభుత్వ కృషి



రైతుల కోసం గతంలో ఎన్నో ప్రభుత్వాలు వాగ్దానాలు చేసినా, వాటిని నెరవేర్చలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ వారి శ్రేయస్సుకు అహర్నిశలూ పాటుపడుతోంది. రైతుల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు అవకాశం కల్పించడం రైతులకు ఓ వరం.
– గంజి రామకృష్ణ, రైతు, కుల్లూరు, కలువాయి మండలం

ఎంతో మేలు కలుగుతుంది



వ్యవసాయ విద్యుత్ మోటార్లకు 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు ఏర్పాటు చేసేవారు. అయితే ఇవి మరమ్మతులకు గురైన సమయాల్లో చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం దీని స్థానంలో 25 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం సంతోషంగా ఉంది.
– కొప్పోలు ఎల్లారెడ్డి, రైతు, రామస్వామిపల్లి, ఆత్మకూరు

ఎంతో సంతోషం



25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలనుకుంటే రూ.రెండు లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే కేవలం రూ.12,600 చెల్లిస్తే ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనుండటం చాలా సంతోషకరం. దీని ద్వారా రైతులు వ్యయప్రయాసలకు గురికాకుండా పంటలను సాగు చేసుకోవచ్చు.
– కేతా ఖాదర్‌రెడ్డి, రైతు, అనంతసాగరం

రైతులకు సువర్ణావకాశం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా రైతులకు ఎస్పీడీసీఎల్ అధికారులు మంచి అవకాశాన్ని కల్పించారు. 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో ఓవర్ లోడ్ వచ్చే అవకాశమే ఉండదు. దీని ద్వారా తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను పొందేందుకు అవకాశం ఉంటుంది. – విజయన్, ఎస్ఈ, ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్

జిల్లాలో నేరాలు తగ్గుముఖం

- ఐజీ పాలరాజు

నెల్లూరు(క్రైమ్): గతేడాదితో పోలిస్తే జిల్లాలో ఈ ఏడాది నేరాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు పేర్కొన్నారు. నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టిన ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని ఆయన అభినందించారు. రేంజ్‌లోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను ఐజీ ఆదివారం నిర్వహించారు. పెండింగ్ గ్రేవ్ కేసులు, రౌడీషీటర్లు, పీడీ యాక్ట్స్, ఎస్పీడబ్ల్యూ, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై సమీక్షించి సిబ్బందికి దిశానిర్దేశనం చేశారు. గ్రేవ్ కేసుల పెండెన్సీ అధికంగా ఉన్న ఐదు స్టేషన్లను తెలుసుకొని వాటి పరిష్కారానికి తగు సూచనలు చేసి దర్యాప్తును వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఐజీ మాట్లాడారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, మహిళల నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రౌడీషీటర్లు, అనుమానితులు, రాజకీయ, సామాజిక ట్రబుల్‌మాంగర్స్, అసాంఘిక శక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. వీరిని బైండోవర్ చేయడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని పాతనేరస్తులు, రౌడీమూకలు, సస్పెక్ట్, కేడీ, డీసీలపై పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లను వెంటనే అమలు చేయాలన్నారు. హత్య, లైంగిక దాడి, గ్యాంగ్‌రేప్, గంజాయి, పోక్సో కేసుల్లో నిందితులపై రౌడీషీట్లు తెరవాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు బ్లాక్ స్పాట్లను గుర్తించి సైన్ బోర్డులు, ఇసుక డ్రమ్ములు, లైటింగ్ తదితరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో నమోదైన కేసులు, రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు, పెండింగ్ కేసులు, గంజాయి అక్రమ రవాణా కట్టడికి చేపడుతున్న చర్యలను ఎస్పీ తెలియజేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: మిచాంగ్ తుఫాన్‌తో నష్టపోయిన ప్రతి రైతునూ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన వెంకన్నపాళెం, బద్దెవోలు, పిడూరుపాళెం, పల్లెపాళెం, కట్టువపల్లి, కొలనకుదురులో మంత్రి ఆదివారం పర్యటించారు. దెబ్బతిన్న పొలాలు, కాలువలు, నారుమడులను పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. నారుమడులు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేసిన అనంతరం మంత్రి మాట్లాడారు. తుఫాన్‌కు ముందే లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన వసతులను కల్పించామని తెలిపారు. దెబ్బతిన్న పొలాలకు సంబంధించిన నివేదికలను తెప్పించుకొని ఆదుకుంటామని తెలిపారు. వరద ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటిస్తూ ఏదేదో మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకునేందుకు ఎన్డీఆర్ఎఫ్ నిబంధనలు ఉంటాయని, వీటి కన్నా అదనంగా సాయం అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధపడ్డారని తెలిపారు. అదనంగా ఇచ్చే సాయానికి కేంద్ర సహకారం లేకపోయినా, మొత్తం భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. తెగిన పంట కాలువలు, చెరువులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు.

ఓట్ల కోసమే సోమిరెడ్డి పాట్లు

ఓట్లపై ధ్యాసే తప్ప ప్రజలు పడుతున్న ఇబ్బందులు సోమిరెడ్డికి పట్టవని మంత్రి విమర్శించారు. అక్కడక్కడా తళుక్కన మెరిసి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. చలో సైదాపురం అంటూ ఇటీవల వెళ్లి అక్కడ క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ జరుగుతోందంటూ విమర్శలు చేసి అంతలోనే ఎందుకు సైలెంట‌య్యారని ప్రశ్నించారు. తాము 14 మంది ఉన్నామంటూ మైనింగ్ యజమానుల వద్ద డబ్బు కొట్టేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా లాభాపేక్ష పనులను మాని ప్రజాసమస్యలపై పోరాడాలని హితవు పలికారు. తహసీల్దార్ శివకృష్ణయ్య, ఎంపీడీఓ ప్రసాద్, ఏడీ శివనాయక్, ఏఓ జహీర్, హౌసింగ్ ఏఈ రవికుమార్, ఎంపీపీ వజ్రమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గుండాల ఆదినారాయణ, అడపాల శివకుమార్‌రెడ్డి, నారపరెడ్డి కిరణ్‌రెడ్డి, యూఎస్కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలువురు సీఐలకు స్థానచలనం

నెల్లూరు(క్రైమ్): గుంటూరు రేంజ్ పరిధిలో గడిచిన రెండు రోజుల్లో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న రోశయ్యను నెల్లూరు ఎస్సీ / ఎస్టీ సెల్ – 1, సుబ్బారావును నెల్లూరు డీసీఆర్బీకి, కోటేశ్వరరావును నెల్లూరు సీసీఎస్‌కు, హైమారావును బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్‌కు బదిలీ చేశారు. కోటేశ్వరరావు, హైమారావు ఆయా ప్రాంతాల్లో బాధ్యతలను ఇప్పటికే స్వీకరించారు.

పది మంది ఎస్సైల బదిలీ

నెల్లూరు(క్రైమ్): జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న పది మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఉత్తర్వులను ఆదివారం జారీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే ఆయా ప్రాంతాల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు.

ఎస్సై	ప్రస్తుతం	బదిలీ ప్రాంతం
అయ్యప్ప	వీఆర్	కలువాయి
క్రాంతికుమార్	డీసీఆర్బీ	దిశ
సుమన్	బాలాజీనగర్	వరికుంటపాడు
విజయశ్రీనివాస్	వరికుంటపాడు	వీఆర్
సంతోష్‌కుమార్	అనంతసాగరం	కలిగిరి
సూర్యప్రకాష్‌రెడ్డి	కలిగిరి	వీఆర్
అనూష	కందలేరు	సీతారామపురం
ప్రభాకర్	దుత్తలూరు	చేజర్ల
ఉమాశంకర్	సీసీఎస్, నెల్లూరు	దుత్తలూరు
మరిడినాయుడు	చేజర్ల	వీఆర్

కోలాహలంగా ఆర్యవైశ్య వనభోజనాలు



హాజరైన దంపతులు



సత్యనారాయణస్వామి వ్రతం

నెల్లూరు(బృందావనం): కార్తీక వనభోజన మహోత్సవం ఆర్యవైశ్య సంఘీయుల ఐక్యతకు నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో అఖండ ఆర్యవైశ్య కుటుంబ వేడుక కార్తీక మాస వనభోజన మహోత్సవాన్ని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పది వేల మందికిపైగా ఆర్యవైశ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడారు. ఆర్యవైశ్యులను ఒకే వేదికపైకి తీసుకురావాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో 650 మందికిపైగా దంపతులు పాల్గొనడం స్వామి వారి కరుణాకటాక్షాలకు నిదర్శనమన్నారు. శివలింగాన్ని ఏర్పాటు చేసి అభిషేకాలు, పూజలు చేశారు. 25 మంది దంపతులకు షష్టిపూర్తి మహోత్సవాన్ని నిర్వహించి వారిని ఘనంగా సత్కరించారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, మాజీ అధ్యక్షుడు కోట సూర్యనారాయణ, బైసాని జ్యోతిప్రసాద్, శ్రీరామ్ సురేష్, రూరల్ అధ్యక్షుడు కనమర్లపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీకి విశేష స్పందన

- హాజరైన 310 మంది విద్యార్థులు
- పరీక్షల నిర్వహణపై తల్లిదండ్రులు, విద్యార్థుల హర్షం

SAKSHI MATH BEE 2023-24



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నెల్లూరు రూరల్: రూరల్ మండలంలోని కలివెలపాళెంలో గల రెయిన్‌బో స్కూల్లో సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలకు విశేష స్పందన లభించింది. ప్రధాన స్పాన్సర్‌గా డ్యూక్స్ కంపెనీ.. అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించాయి. చిన్నతనంలోనే ఇలాంటి పోటీ పరీక్షలను నిర్వహించడం ద్వారా తమ పిల్లలకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. నగరం, పరిసర ప్రాంతాల్లోని రెయిన్‌బో, ఓవెల్ స్కూళ్లు, ప్రియాంక, అక్షర విద్యాలయం, కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. స్పెల్ బీ పరీక్షను 250 మంది, మ్యాథ్స్ బీ పరీక్షను 60 మంది విద్యార్థులు రాశారు. పరీక్షను నిర్వహించిన సాక్షి మీడియా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. సాక్షి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు.

SAKSHI SPELL Bee 2023-24

విజయపథంలోకి దూసుకెళ్లేందుకు దోహదం



విద్యార్థులు చక్కటి ఆలోచనలతో విజయపథంలోకి వెళ్లేందుకు ఇలాంటి పరీక్షలు ఎంతో దోహదపడతాయి. పోటీ పరీక్షలకు అవసరమైన పరిజ్ఞానం పిల్లలకు ఏర్పడుతుంది. విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకాలు సైతం ఇందులో ఉన్నాయి. మా కుమారుడు పరీక్షకు హాజరవ్వడం చాలా సంతోషంగా ఉంది.
– సతీష్, విద్యార్థి తండ్రి, పొదలకూరు రోడ్డు

పిల్లల విజ్ఞానం బయటపడుతుంది



ఇలాంటి పరీక్షల ద్వారా పిల్లల్లోని విజ్ఞానం బయటపడుతుంది. మా కుమారుడు తొలిసారిగా పరీక్ష రాశాడు. పరీక్ష విధానం చాలా బాగుందని చెప్పాడు. పాఠశాలల్లో చదువుతో పాటు ఇలాంటి పోటీ పరీక్షలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. పిల్లల టాలెంట్‌ను తెలుసుకునేందుకు అవకాశం ఉంది.
– అనూష, విద్యార్థి తల్లి, కొత్తూరు

సాక్షికి కృతజ్ఞతలు



సాక్షి మీడియా ద్వారా నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్షలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. ఇలాంటి పరీక్షల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించడం గొప్ప పరిణామం. మా కుమార్తె, కుమారుడు పరీక్షలకు హాజరయ్యారు. చాలా సంతోషంగా ఉంది.
– సుధ, విద్యార్థి తల్లి, ముదివర్తి, విడవలూరు మండలం

పరీక్ష బాగుంది



స్పెల్ బీ పరీక్ష ఎంతో బాగుంది. మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పరీక్షకు హాజరయ్యా. ఇలాంటి పరీక్షల ద్వారా విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది. పరీక్ష రాసినందుకు చాలా ఆనందంగా ఉంది.
– అయాన్ సుహాష్, విద్యార్థి, ఓవెల్ విస్‌లైట్ స్కూల్

తొలిసారి రాశా..



నాలుగో తరగతి చదువుతున్నా. గతంలో ఎన్నడూ ఇలాంటి పరీక్షలు రాయలేదు. పాఠశాల తరఫున తొలిసారిగా ఈ పరీక్షను రాశా. ఇలాంటి పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. భవిష్యత్తులో ఉన్నతంగా రాణించేందుకు పరీక్షలు ఎంతో దోహదపడతాయి.
– సారా ఖైర్, విద్యార్థి, ఓవెల్ విస్‌లైట్ స్కూల్

పోటీ పరీక్షలకు దోహదం



స్థానిక జెడ్పీ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నా. నాతో పాటు మా తమ్ముడు సైతం పరీక్షకు హాజరయ్యాడు. ఎన్నో విషయాలను తెలుసుకున్నాం. పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఈ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయి. సాక్షి మీడియాకు కృతజ్ఞతలు.
– చందన, విద్యార్థి, ముదివర్తి, విడవలూరు

క్లుప్తంగా

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఏం కష్టమొచ్చిందో తెలియదు కాని గుర్తుతెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వేదాయపాళెం రైల్వేస్టేషన్ వద్ద చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మృతుడు సుమారు 20 నుంచి 25 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండి తెలుపు రంగు హాఫ్ హ్యాండ్స్ టీ షర్టు, బ్లూ కలర్ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్ హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. జీజీహెచ్ మార్చురీకి మృతదేహాన్ని తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



వేదాయపాళెం స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ నారాయణ

నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వీడి సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని, జులుం చేస్తే తాటతీస్తామని నగర పోలీసు అధికారులు హెచ్చరించారు. ఆదివారం నగరంలోని ఆరు పోలీసుస్టేషన్‌లలో రౌడీషీటర్లు, సస్పెక్టెడ్‌లు, కేడీలు, డీసీలకు పోలీసు అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్లు మాట్లాడుతూ రౌడీయిజం చెలాయించినా, ఘర్షణలకు పాల్పడినా సహించేది లేదన్నారు. పదేపదే నేరాలకు పాల్పడే వారిపై పీడీయాక్ట్‌లు నమోదవుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రవర్తన మార్చుకుని పనులు చేసుకుంటూ కుటుంబంతో సంతోషంగా జీవించాలన్నారు. మీ ప్రాంతాల్లో ఏదైనా చీకటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలన్నారు. పాత వ్యవహారాలకు స్వస్థిపలికి పద్ధతిగా జీవిస్తున్నట్లు తెలిస్తే రౌడీషీట్లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌స్పెక్టర్లు ఎం బాబీ, బీ కళ్యాణ్‌రాజు, సుబ్బారావు, పీవీ నారాయణ, రాములునాయక్, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

కోనేరులో మునిగి వ్యక్తి మృతి



సురేష్ మృతదేహం

ఇందుకూరుపేట: ప్రమాదవశాత్తు కాలుజారడంతో కోనేరులో మునిగిపోయి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గంగపట్నం శ్రీచాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు...టీపీ గూడూరు మండలం పేడూరుకు చెందిన నెట్రంబాక సురేష్(32), సుప్రజ దంపతులు. వారికి ఇద్దరు సంతానం. బంధువుల పొంగళ్ల కార్యక్రమం నిమిత్తం సురేష్ కుటుంబంతో కలిసి చాముండేశ్వరీదేవి ఆలయానికి వచ్చాడు. కాళ్లు కడుగుకునేందుకు కోనేటి వద్దకు వెళ్లగా కాలుజారడంతో సురేష్ నీటిలో మునిగిపోయాడు. పక్కనే ఉన్న భార్య గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కలు వారు అక్కడ గుమికూడారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి స్థానిక ఈతగాళ్లను తీసుకొచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు గంట తరువాత సురేష్ విగతజీవిగా బయటపడ్డాడు. అప్పటి వరకు తమతోనే ఉన్న సురేష్ అంతలోనే తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో భార్య, పిల్లలతో పాటు బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న ఎస్సై వీరేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.85
లేయర్	రూ.90
బ్రాయిలర్ చికెన్:	రూ.160
స్కిన్‌లెస్ చికెన్:	రూ.180
లేయర్ చికెన్:	రూ.153



అన్నదాతలకు స్థైర్యం

- నేటి నుంచి తుఫాన్ నష్టంపై వ్యవసాయాధికారుల క్షేత్ర పరిశీలన
- ఏఏ పంటలు..ఎంత మేర నష్టం జరిగిందనే వివరాల సేకరణ
- ఇప్పటికే 80 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ
- నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు



తుఫాన్ గాలులకు నేలకొరిగిన నిమ్మ చెట్లు (ఫైల్)



తుఫాన్‌తో మునిగిన వరి నారుమడి (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాపై మిచాంగ్ రూపంలో తుఫాన్ విరుచుకుపడింది. అధికారులు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నా పంట నష్టం మాత్రం జరిగింది. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ప్రాథమిక దశలోనే పంట దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేస్తోంది. మిగిలిన దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులకు పరిహారం అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు సిద్ధమవుతున్నారు.

నేటి నుంచి క్షేత్ర స్థాయి పరిశీలన

జిల్లాలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఏఏ ప్రాంతంలో ఎంత మేర పంట నష్టం వాటిల్లిందనే విషయంపై నేటి నుంచి మండల, గ్రామ స్థాయిలోని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు వివరాలు సేకరించనున్నారు. వాస్తవంగా పంట ఏ మేరకు దెబ్బతింది...రైతులకు ఎంత మేర నష్టం వాటిల్లింది అనే వివరాలను సేకరించనున్నారు. తుఫాన్ వచ్చిన వెంటనే ఎంత మేర నష్టం జరిగిందనేది తెలియదని, కొన్ని రోజుల తరువాత వాస్తవ నష్టాన్ని అంచనా వేయవచ్చని అధికారులు చెబుతున్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి పంట నష్టం వివరాలు సేకరించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రభుత్వం కూడా తక్షణమే నష్టాన్ని అంచనా వేసి వివరాలు పంపాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

80 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ

జిల్లాలో తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీకి ఇప్పటికే వ్యవసాయాధికారులు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా జిల్లాలోని 34 మండలాల్లోని 238 గ్రామాల్లో 11,257 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పంట మొదటి దశలో దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో వరి, వేరుశనగ, శనగ, ఉలవ పంటలు దెబ్బతిన్నట్లు ఇప్పటికే అధికారులు గుర్తించారు. ఆయా రైతులకు సబ్సిడీపై విత్తనాలను గ్రామాల్లోని ఆర్బీకేల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టారు.

నష్టపరిహారం అందేలా..

తుఫాన్ దాటికి పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నేటి నుంచి జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న వరి, కూరగాయ పంటలతో పాటు నిమ్మ, మామిడి, తదితర ఉద్యాన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులు వివరాలను సేకరించనున్నారు. పొలంలోని పంట 33 శాతం కంటే ఎక్కువగా నష్టం జరిగిందా లేక తక్కువగా జరిగిందా అనే వివరాలను సేకరించనున్నారు. దానికి అనుగుణంగా రైతులకు ఎక్కడా నష్టం వాటిల్లకుండా పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

రైతులను ఆదుకుంటాం



తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఇప్పటికే 80 శాతం సబ్సిడీపై విత్తనాలను అందిస్తున్నాం. ఇతర పంటల నష్టం వివరాలను సేకరిస్తున్నాం. ప్రభుత్వానికి నివేదిక పంపి రైతులు ఎక్కడా నష్టపోకుండా అన్ని రకాలుగా ఆదుకుంటాం.

–సత్యవాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి

ఉద్యాన పంటలపై ప్రత్యేక దృష్టి



తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ఉద్యాన పంటల వివరాలను క్షేత్రస్థాయి సిబ్బంది సాయంతో సేకరిస్తున్నాం. పూర్తిస్థాయిలో నష్టం వివరాలు అందిన వెంటనే ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకుంటాం.

–సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో సమగ్ర సోమశిల

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



కనుపూరుపల్లి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: సోమశిల జలాశయం పరిధిలోని అసంపూర్తి పనులను పూర్తి చేయడంతో పాటు అత్యంత ప్రధానమైన సోమశిల హైలెవల్ కెనాల్‌ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి వీలుగా 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో సమగ్ర సోమశిల అంశాన్ని పొందుపరచాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరుకు చెందిన 1400 ఎకరాల మాగాణి ఆయకట్టుకు పెన్నానది నుంచి సాగునీటిని సరఫరా చేసే కనుపూరుపల్లి ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులను రైతులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం తరఫున ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనుల కోసం రూ.5 లక్షల చెక్కును రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ల క్రితం భారీ వరదలకు కనుపూరుపల్లి ఎత్తిపోతల పథకం దెబ్బతిని నిరుపయోగంగా మారిందని తెలిపారు. ఈ సమస్యను ఆత్మకూరు రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తన దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్‌తో మాట్లాడి రూ.5 లక్షలు మంజూరు చేయిస్తున్నామని చెప్పారు. ఏడీఎఫ్ తరఫున రూ.5 లక్షలు సహకారం అందించామని తెలిపారు. స్థానిక రైతులు చందాలు వేసుకుని ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశంలో సోమశిల జలాశయం నుంచి డెల్టాకు మాత్రమే నీటి విడుదల చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. దీంతో సీఎం వైఎస్ జగన్ దృష్టికి ఉత్తర, దక్షిణ కాలువల ఆయకట్టు రైతుల సాగునీటి సమస్యను తీసుకెళ్లామన్నారు. ఈ నేపథ్యంలో అన్నమయ్య ప్రాజెక్ట్ నుంచి రెండు టీఎంసీలను సోమశిల జలాశయానికి విడుదల చేయడం, సోమశిల జలాశయం డెడ్ స్టోరేజీని తగ్గించుకోవడం ద్వారా ఐదు టీఎంసీల సాగునీరు ఆత్మకూరు నియోజకవర్గ రైతులకు అందించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. అందుకు సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మకూరు నియోజకవర్గ రైతుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 35 టీఎంసీలు ఉన్నాయని, సాగునీటిని పొదుపుగా వాడుకుని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. ఈ విషయమై వ్యవసాయ రంగ నిపుణులతో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా రైతులకు అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి అంశాన్ని వంద శాతం పూర్తి చేస్తుందనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని మెట్టప్రాంతమైన మర్రిపాడు మండలంలో సైతం సాగునీటి సమస్య లేకుండా చేసేందుకు చిత్తశుద్ధితో పాటు పడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, ఐడీసీ డీఈ సిరాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ చిల్లారు ఆదిశేషయ్య, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, వాసిపల్లి లక్ష్మీరెడ్డి, రైతు సంఘ నాయకులు జెట్టి వెంకట కృష్ణారెడ్డి, అల్లారెడ్డి రమేష్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, దొడ్ల వెంకురెడ్డి, ఏడెం శ్రీనివాసులురెడ్డి, గడ్డం శ్రీనివాసులురెడ్డి, ఇందూరు రాజశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, తోడేటి అశోక్, శంకరయ్య యాదవ్, శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఎన్‌ఎం కోర్సు పరీక్షలు

- మహిళా ప్రాంగణంలో ఏర్పాట్లు
- గుంటూరు, ప్రకాశం, నెల్లూరు నుంచి హాజరుకానున్న 820 మంది విద్యార్థులు

నెల్లూరు సిటీ: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం కోర్సు పరీక్షలను సోమవారం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు సంబంధించి 14 నర్సింగ్ కళాశాలలకు చెందిన మొత్తం 820 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. గతంలో ప్రకాశం జిల్లాలో ఏఎన్‌ఎం కోర్సు పరీక్షలు నిర్వహిస్తుండగా, ఈ ఏడాది నెల్లూరులో నిర్వహిస్తున్నారు. దీంతో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రతిష్టాత్మకంగా పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశాల మేరకు అదనపు జిల్లా వైద్యాధికారి ఖాదర్‌వలి ఆధ్వర్యంలో నగరంలోని మహిళా ప్రాంగణంలో పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఐదురోజుల పాటు జరిగే పరీక్షల్లో మొదటి మూడు రోజులు థియరీ, చివరి రెండు రోజులు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలను ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించనున్నారు. తొలుత నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో ఏఎన్‌ఎం కోర్సు పరీక్షలు నిర్వహించాలని వైద్యారోగ్య శాఖ అధికారులు నిర్ణయించారు. అయితే డీకేడబ్ల్యూ కళాశాల విద్యార్థులకు పరీక్షలు ఉండడంతో ఏఎన్‌ఎం కోర్సు పరీక్షల సెంటర్‌ను మహిళా ప్రాంగణానికి మార్చారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 400 , మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు 420 మందికి పరీక్షలు జరపనున్నారు. 55 మంది ఇన్విజిలేటర్లు, ముగ్గురు వైద్యులతో కూడిన స్క్వాడ్, ఒక చీఫ్‌ఎగ్జామినర్, డీఎఅండ్‌హెచ్‌ఓ కార్యాలయ ఉద్యోగులు 6, మరో 8 మంది అటెండర్లతో కలిపి మొత్తం 75 మంది పరీక్షల విధులు నిర్వహించనున్నారు.

మనస్తాపంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఫోన్ విషయంలో తల్లిదండ్రులు మందలించారని ఓ బాలిక బలవన్మరణానికి పాల్పడిన ఘటన మరువక ముందే పరీక్షల్లో మార్కులు ఎందుకు తక్కువగా వచ్చాయని తల్లిదండ్రులు ప్రశ్నించడాన్ని జీర్ణించుకోలేక ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు..హరనాథపురానికి చెందిన ప్రతాప్‌రెడ్డి, ప్రశాంతి దంపతుల కుమార్తె సోహిని(17) నగరంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల జరిగిన వారంతపు పరీక్షల్లో ఆమెకు తక్కువ మార్కులు వచ్చాయి. మార్కులు ఎందుకు తక్కువగా వచ్చాయని తల్లిదండ్రులు ప్రశ్నించడంతో ఆమె మనస్తాపానికి గురైంది. ఈ నెల 9న శనివారం రాత్రి బాలిక తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు బాధిత తల్లి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్షనిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దిగజారుడు రాజకీయాలను టీడీపీ మానుకోవాలి

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్



బీటీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'గత నెల 7న సింహపురి ఆస్పత్రి జంక్షన్ నుంచి యలమవారిదిన్నెకు బీటీరోడ్డుకు టెండర్లు పిలిచాం, 23న టెండర్లు ఓపెన్ చేయడం జరిగింది.మరో వారం రోజుల్లో పనులు ప్రారంభించాలనుకోగా వర్షాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు రోడ్డు వేయాలని ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉంది. ఇటువంటి దిగజారుడు రాజకీయాలను టీడీపీ నాయకులు మానుకోవాలి' అని నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ హితువు పలికారు. నగరంలోని 15వ డివిజన్ సింహపురి హాస్పిటల్ జంక్షన్ నుంచి యలమవారిదిన్నెకు వెళ్లే మార్గంలో రూ.30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యలమవారిదిన్నె రోడ్డు చిన్నదిగా మారడంతో విస్తరిస్తూ బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఎలమవారిదిన్నె, మిట్టపాళెం, బలిజపాళెం, తదితర ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దాదాపు అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పార్కులు ప్రారంభించామన్నారు.

తుఫాన్‌లో ఏ రోజైనా నారాయణ కనిపించారా?

ఇటీవల వచ్చిన తుఫాన్ సమయంలో టీడీపీ నాయకులు మేమున్నామంటూ తిరుగుతూ ఫొటోలు దిగడం తప్ప ఎవరికైనా కనీసం భోజనం అందించారా? అని ఎమ్మెల్యే అనిల్ కుమార్ ప్రశ్నించారు. కరోనా సమయంలో, వరదల్లో నారాయణ కనిపించలేదన్నారు. కనీసం వారం రోజుల క్రితం వచ్చిన తుఫాన్ సమయంలోనూ ఆయన కనిపించలేదన్నారు. తుఫాన్ తగ్గిన తరువాత బయటకొచ్చి తమను విమర్శించడం మంచిపద్ధతి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికార యంత్రాంగం తుఫాన్ సమయంలో నిరంతరం ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. వర్షాలు తగ్గిన తరువాత టీడీపీ నాయకులు వచ్చి తాము చేసినట్లు నాటకాలు ఆడడం విడ్డూరంగా ఉందన్నారు. 2015లో కంటే మిచాంగ్ తుఫాన్‌తో భారీ వర్షాలు కురిశాయని తెలిపారు. అయినా నగర నియోజకవర్గంలో ఎక్కడా ప్రజలు అంతగా ఇబ్బంది పడలేదన్నారు. ఏదైనా విపత్తు వచ్చినప్పుడు ప్రజల సహకారంతో అందరూ కలిసి పనిచేయాలేతప్ప, అనవసరమైన విమర్శలు మానుకోవాలని సూచించారు. 2015లో విపత్తు వచ్చినప్పుడు తామెక్కడా విమర్శలు చేయలేదన్నారు. తమ వంతు ప్రజలకు భోజనాలు అందించి ప్రజలకు సేవచేశామని గుర్తుచేస్తున్నామన్నారు. ఏదైనా విపత్తు వచ్చినప్పుడు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ ముందుండి ప్రజలకు సేవ చేస్తుందన్నారు. బాధల్లో ఉన్నప్పుడు ప్రజలు ఏదైనా మాట్లాడితే వాటిని స్వీకరించి వారికి అవసరమైన సహాయసహకారాలు అందిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రక్త మోడిన జాతీయ రహదారి

- వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి
- ఒకరికి తీవ్రగాయాలు



దగదర్తి మండలం ఉలవపాళ్ల వద్ద ట్రాలీ ఢీకొనడంతో మృతి చెందిన చౌటూరు శూలం



ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో స్కూటీ అదుపుతప్పడంతో మృతి చెందిన యోగేంద్ర

కావలి: కావలి–దగదర్తి మధ్యన జాతీయ రహదారి ఆదివారం రక్తమోడింది. వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..

కూలీ పనులకు వెళ్తుండగా...

బోగోలు మండలం రామస్వామిపాళెం గిరిజన కాలనీకి చెందిన చౌటూరు శూలం(30), పాముల మస్తాన్ ద్విచక్ర వాహనంపై కూలీ పనులకు అల్లూరు మండలం సింగపేటకు బయలుదేరారు. ఉలవపాళ్ల కూడలి వద్ద కు చేరుకోగానే నెల్లూరు నుంచి కావలి వైపు వెళుతున్న ట్రాలీ డీజిల్ కోసం పెట్రోల్‌బంక్‌కు వెళ్లేందుకు రాంగ్‌రూట్‌లోకి మారుతూ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో చౌటూరు శూలం అక్కడికక్కడే మృతి చెందగా పాముల మస్తాన్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని వెంటనే కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దగదర్తి ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో..

ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో స్కూటీ అదుపుతప్పడంతో కావలికి చెందిన గండూరి యేగేంద్ర (22) అక్కడికక్కడే మృతి చెందాడు. కావలి రూరల్ ఎస్సై సుమన్ వివరాల మేరకు.. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన యేగేంద్ర స్కూటీపై నెల్లూరు వెళుతుండగా టోల్‌ప్లాజా దాటిన తరువాత ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో పడిపోయాడు. హైవే ఫెన్సింగ్‌కు బలంగా గుద్దుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కావలి రూరల్ ఎస్సై సుమన్ తెలిపారు.

ఉలవపాళ్ల కూడలి వద్ద నిత్యం ప్రమాదాలే

దగదర్తి మండలం ఉలవపాళ్ల కూడలి వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. నెల్లూరు, దగదర్తి, బోగోలు మండలాల నుంచి అల్లూరుకు వెళ్లాలన్నా, దగదర్తి మండలం ఉలవపాళ్ల నుంచి, అల్లూరు మండలం నుంచి హైవే మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఈ కూడలి నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో ఫ్లైఓవర్ లేకపోవడం ప్రధాన సమస్య కాగా, రోడ్డుకు ఇరువైపులా అడ్డగోలుగా నిలిపేస్తున్న లారీలు ప్రమాదాలకు మరో కారణంగా నిలుస్తున్నాయి. కూడలిలోని దాబా హోటల్, టిఫిన్ అంగళ్ల వద్ద లారీలను కూడలికి ఇరువైపులా నిలిపేస్తున్నారు. దీంతో కూడలి దాటే వాళ్లకు హైవేపై వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయంలో పోలీసులు, హైవే సిబ్బంది చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.